# సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023






### గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్: యాదాద్రి జిల్లా రాజపేట మండలం చల్లూరుకు చెందిన సహాయోగ్ గోశాలకు రాజన్న కోడెలు 8, ఆవులు 10 అందజేశారు.



### బస్సులు నడపండి

సిరిసిల్లఅర్బన్: మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థుల కోసం బస్సులు నడపాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల డీఎంకు వినతిపత్రం ఇచ్చారు.

### వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పాపన్న జయంతి అధికారికంగా నిర్వహించండి



మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవికి వినతిపత్రం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

**వేములవాడ:** సర్వాయి పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్‌లకు గురువారం వినతిపత్రం అందించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న సెంటర్‌కు పాపన్నచౌక్‌గా నామకరణం చేస్తూ మున్సిపల్‌లో తీర్మానించి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

### కబ్జాకు గురైన చెరువును కాపాడాలి



చెరువు వద్ద కబ్జాదారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** మండలంలోని అల్మాస్‌పూర్‌లో కబ్జాకు గురైన చెరువును కాపాడాలని కోరుతూ గ్రామస్తులు గురువారం చెరువు వద్ద ఆందోళన చేపట్టారు. చెరువు వద్దకు వచ్చిన కబ్జాదారులను అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరిన గ్రామస్తులు మాట్లాడుతూ చెరువులో నింపిన మట్టిని వెలికితీయాలని, అక్కడికి విద్యుత్ లైన్లు వేయొద్దని కోరారు. గతంలో మాదిరిగా చెరువును పునరుద్ధరించాలని కోరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సింగరవేణి కృష్ణహరి మాట్లాడుతూ చెరువు విషయంలో ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, కొండం శ్రీను, పందిర్ల శ్రీనివాస్, చందుయాదవ్, రాజయ్య, మల్లయ్య, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, సతీశ్, సురేష్, అభిషేక్‌యాదవ్, స్వామి పాల్గొన్నారు.


### ప్రమాద బీమాతో కుటుంబానికి అండ



మృతుడి భార్య రేవతికి చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

**ముస్తాబాద్(సిరిసిల్ల):** ప్రమాద బీమాతో కుటుంబాలకు అండగా నిలవ వచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొండాపూర్‌కు చెందిన కొత్తపల్లి క్రాంతికుమార్ భార్య రేవతి, కుటుంబానికి ప్రమాదబీమా మొత్తం రూ.20లక్షల చెక్కును గురువారం అందజేశారు. రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ప్రమాదబీమా ద్వారా రూ.వెయ్యితో రూ.20లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు పీఎంజేజేబీవై ద్వారా ఏడాదికి రూ.436, పీఎంఎస్‌బీవై ద్వారా ఏడాదికి రూ.20 జనరల్ ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. సర్పంచ్ యారటి లక్ష్మి, జీబీ మేనేజర్ వీరన్న, బ్రాంచ్ మేనేజర్ చందు, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ మేనేజర్ సనత్, సింగిల్‌విండో మాజీ వైస్‌చైర్మన్ దేవిరెడ్డి, కరుణాకర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

### కంప్యూటర్ విద్య పకడ్బందీగా నిర్వహించాలి



మోడల్‌స్కూల్‌లో వంట గదిని పరిశీలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

**బోయినపల్లి(చొప్పదండి):** జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంప్యూటర్ ఛాంప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. బోయినపల్లిలోని హైస్కూల్, ప్రైమరీ స్కూల్, మోడల్‌స్కూళ్లను గురువారం తనిఖీ చేశారు. వంటగదిలో ఫుడ్ మెటీరియల్ గడువు తేదీలు పరిశీలించారు. కంప్యూటర్ విద్యపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చేతిరాత మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఏవో పద్మజ, ఎంఈఓ శ్రీనివాసదీక్షిత్ ఉన్నారు.

# విద్యుత్‌బిల్లుల ఊరట

- సబ్సిడీ రద్దుపై హైకోర్టు స్టే
- పవర్‌లూమ్స్ యజమానులకు ఊరట
- సెస్‌పై బకాయిల భారం
- 127 మంది యజమానులు 163 కార్ఖానాలు
- కోర్టు ఆదేశాల మేరకు ముందుకెళ్తాం : సెస్ ఎండీ రామకృష్ణ



సిరిసిల్లలోని పవర్‌లూమ్స్

**సిరిసిల్ల:** సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగానికి ఎదురైన కొత్త సవాళ్లు తాత్కాలికంగా పరిష్కారమయ్యాయి. 163 మరమగ్గాల కార్ఖానాలకు విద్యుత్ రాయితీని రద్దు చేస్తూ 'సెస్' సంస్థ జారీ చేసిన నోటీసుల అమలుపై స్టే విధిస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సిరిసిల్లలోని చిన్నతరహా పరిశ్రమలకు ఊరట లభించింది. సిరిసిల్లలో 10 హెచ్‌పీల కంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగిస్తున్న.. ఎక్కువ సంఖ్యలో విద్యుత్ మీటర్లను కలిగిన ఉన్న సాంచాల(పవర్‌లూమ్) కార్ఖానాలకు కరెంట్ సబ్సిడీని రద్దు చేస్తూ 'సెస్' సంస్థ వంద శాతం విద్యుత్ బిల్లులను రెండు నెలల కిందట జారీ చేసింది. చిన్నతరహా పరిశ్రమలు(ఎస్ఎస్ఐ) యూనిట్లుగా ఉన్న 127 మంది యజమానులకు చెందిన 163 కార్ఖానాలకు విద్యుత్ బిల్లులు, నోటీసులు రిజిస్టర్ పోస్ట్‌లో పంపించారు. సబ్సిడీ రద్దుతో సుమారు రూ.5కోట్ల మేరకు అదనపు విద్యుత్ బిల్లింగ్ అయింది. ఈ బిల్లులను ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులు చెల్లించకపోగా కోర్టును ఆశ్రయించారు.

### మీటర్ల కేటగిరీ మార్పు

మరమగ్గాలను కుటీర పరిశ్రమగా గుర్తించి కేటగిరీ–4లో యూనిట్ విద్యుత్‌ను రూ.4కు సరఫరా చేసేవారు. ఇందులో సగం అంటే.. ప్రతి యూనిట్‌కు రూ.2 ప్రభుత్వం భరిస్తుండగా మరో రూ.2ను మరమగ్గాల యజమాని చెల్లించేవారు. ఇటీవల జారీ అయిన కోర్టు ఆదేశాలతో కేటగిరీ–4లో ఉన్న మరమగ్గాలను కేటగిరీ–3గా మార్చారు. కుటీర పరిశ్రమను వాణిజ్య(కమర్షియల్)ంగా మార్చడంతో ప్రతి యూనిట్‌కు రూ.7 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన సిరిసిల్లలోని 127 ఎస్ఎస్ఐ యూనిట్లకు 163 కార్ఖానాలకు 2016 నుంచి రూ.5 కోట్ల మేరకు అదనపు బిల్లింగ్ అయింది. ఈమేరకు కేటగిరీని మార్చుతున్నట్లు పేర్కొంటూ 'సెస్' అధికారులు నోటీసులు, విద్యుత్ బిల్లులను జారీ చేశారు. ఆ బిల్లులను తీసుకునేందుకు మరమగ్గాల యజమానులు నిరాకరించడంతో రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిణీ చేశారు. కొందరు రిజిస్టర్ పోస్టు తీసుకోగా.. మరికొందరు రిటర్న్ పంపినట్లు సమాచారం.

### ఆర్థిక సంక్షోభంలో 'సెస్'

జిల్లాలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సంస్థ విద్యుత్ పంపిణీ చేస్తుంది. 10 హెచ్‌పీల కంటే ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించే కార్ఖానాలకు 50 శాతం సబ్సిడీని రద్దు చేయాలని ఇటీవల కోర్టు ఆదేశాలు జారీ కావడంతో 2016 నుంచి బిల్లింగ్ చేశారు. మగ్గాలకు సంబంధించిన 50 శాతం రాయితీ డబ్బులు ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు రావాల్సి ఉంది. మరోవైపు ఇతర విద్యుత్ కనెక్షన్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో రూ.100 కోట్ల మేరకు 'సెస్'కు రావాల్సి ఉంది.

### అధికార పార్టీ నేతల అండతో..

విద్యుత్ బిల్లుల రద్దు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీకావడంతో సిరిసిల్లలోని ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులు మంత్రి కేటీఆర్‌ను సంప్రదించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ సూచనలతో హైకోర్టును ఆశ్రయించారు. సిరిసిల్లకు చెందిన 'సెస్' పాలకవర్గంలో ముఖ్యుడు ఒకరు కొందరి ఎస్ఎస్ఐ కార్ఖానాల యజమానుల వద్ద రూ.10 లక్షలు తీసుకుని హైకోర్టులో స్టే కోసం కేసు ఫైల్ చేశారు. ఈ నేపథ్యంలో వంద శాతం విద్యుత్ బిల్లుల వసూళ్లపై స్టే లభించినట్లు సమాచారం. అయితే కోర్టును ఆశ్రయించిన తొమ్మిది మంది ఎస్ఎస్ఐ యూనిట్ల యజమానులకే ఈ వెసులుబాటు లభించింది. దీంతో మిగతా వారి తరఫున రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని కేసు మళ్లీ ఫైల్ చేశారు. దీంతో వారికి కూడా స్టే వస్తుందని భావిస్తున్నారు. మొత్తంగా అధికార పార్టీ నేతల అండతో రూ.లక్షలు చెల్లించి హైకోర్టు ద్వారా స్టే తెచ్చుకోవడం విశేషం. ఏది ఏమైనా ఇదే అంశంపై ఇటీవల మంత్రి కేటీఆర్‌కు 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావుపై పాలిస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. 'సెస్' సంస్థ మాత్రం ప్రభుత్వం ద్వారా విద్యుత్ బకాయిలు వసూలు కాక ఆర్థిక సంక్షోభంలో ఉంది.

### కోర్టు ఆదేశాలు అమలు చేస్తాం



సిరిసిల్లలో తొమ్మిది మందిపై బిల్లుల వసూళ్లకు ఎలాంటి ఒత్తిడి చేయవద్దని కోర్టు ఆదేశాలు వెలువడ్డాయి. దీనిపై కోర్టులో మా వాదన వినిపిస్తాం. కోర్టు స్టే పరిధిలో లేని వారు మాత్రం నోటీసుల ప్రకారం బిల్లులు చెల్లించాల్సిందే. భవిష్యత్‌లోనూ కోర్టు ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

– ఎస్.రామకృష్ణ, 'సెస్' మేనేజింగ్ డైరెక్టర్

# గృహ'లక్ష' దరఖాస్తులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 99,696
- అర్జీదారులతో కిక్కిరిసిన కార్యాలయాలు
- అత్యధికంగా పెద్దపల్లిలో 14,753
- ఈనెల 20లోగా పరిశీలన పూర్తి



తహసీల్దార్ కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు

**సాక్షి, పెద్దపల్లి:** రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 99,696 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి మూడువేల మందిని మొదటి విడతలో ఎంపిక చేయనుండడం.. గురువారం చివరిరోజు కావడంతో దరఖాస్తుదారులు పోటెత్తారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు కిక్కిరిశాయి. గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ అని, నిర్ణీత గడువులేదని మంత్రులు ప్రకటిస్తున్నా.. మొదటి విడతలోనే సహాయం పొందాలని భావిస్తున్న వివిధ వర్గాల ప్రజలు అర్జీలు పెట్టుకునేందుకు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద బారులు తీరారు. కావాల్సిన సర్టిఫికెట్లు, దరఖాస్తుల కోసం అర్జీలు పెట్టుకునే వారితో మీసేవా కేంద్రాల్లో రద్దీ నెలకొంది.

**అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గంలో..**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 నియోజకవర్గాల పరిధిలో 99,696 దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గంలో14,753 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా చొప్పదండి నియోజకవర్గంలో చొప్పదండి 3,176 దరఖాస్తులు వచ్చాయి. గురువారం వరకు వచ్చిన దరఖాస్తుదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్హులైన వారి జాబితాను ఈనెల 20లోగా ప్రకటించాలని నిర్ణయించారు. గడువు (ఈనెల10) తరువాత వచ్చిన దరఖాస్తులను రెండోవిడుతలో పరిశీలించాలని నిర్ణయించారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి, ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగాగృహలక్ష్మి దరఖాస్తులు

| | |
|---|---|
| కరీంనగర్ | 3,429 |
| కోరుట్ల | 6,730 |
| మానకొండూరు | 4,499 |
| వేములవాడ | 12,913 |
| సిరిసిల్ల | 9,979 |
| చొప్పదండి | 3,176 |
| హుజూరాబాద్ | 13,437 |
| పెద్దపల్లి | 14,753 |
| రామగుండం | 7,402 |
| మంథని | 7,950 |
| జగిత్యాల | 8,120 |
| ధర్మపురి | 7,308 |
| మొత్తం | 99,696 |

**అసౌకర్యాలతో ఇబ్బందులు పడిన మహిళలు**

గృహలక్ష్మికి మహిళల పేరు మీద దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి మహిళలు, వారి భర్తలు, పిల్లలతో ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. అక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# గల్ఫ్ ఏజెన్సీలు మోసగిస్తే పీడీయాక్టు

- నకిలీ ఏజెంట్లను ఆశ్రయించొద్దు
- ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి

**సిరిసిల్లక్రైం:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి పొందిన గల్ఫ్ ఏజెన్సీలు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దుతోపాటు నిర్వాహకులపై పీడీయాక్టు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఈమేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ ఉన్న ఏజెన్సీలనే ఆశ్రయించాలని సూచించారు. నకిలీ ఏజెంట్లపై 21 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గల్ఫ్ ఏజెంట్లను సంప్రదించే ముందు 87126 56411 నంబర్‌ను సంప్రదిస్తే అన్ని వివరాలపై స్పష్టత వస్తుందని వివరించారు. ఏజెంట్ల చేతిలో మోసపోతే వెంటనే 87126 56411 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.



ఎస్పీ అఖిల్ మహాజన్

**పది మంది బైండోవర్**

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలానికి చెందిన అనధికారికంగా ఉన్న పది మంది గల్ఫ్ ఏజెంట్లను గురువారం తహసీల్దార్ భూపతి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. గల్ఫ్ ఏజెంట్ల మోసాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# అభివృద్ధి చెందే రాష్ట్రాలకు తెలంగాణ మోడల్

- నిరుద్యోగుల మనసెరిగిన సీఎం
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు
- వీఆర్ఏలకు పోస్టింగ్ ఆర్డర్లు



ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

**సిరిసిల్లటౌన్:** తొమ్మిదేండ్ల సుపరిపాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అభివృద్ధి చెందే రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తుందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. జిల్లాలో రెగ్యులరైజేషన్ అయిన వీఆర్ఏలు, పంచాయతీ సెక్రటరీలను వివిధ శాఖల్లో చేరేందుకు ఉత్తర్వుల పంపిణీని కలెక్టరేట్ గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతోపాటు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించేలా సీఎం కేసీఆర్ దార్శనీయత అభినందనీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ నిరుద్యోగులు, వీఆర్ఏల సంక్షేమానికి సీఎం కేసీఆర్ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. రెగ్యులర్ ఉద్యోగాల్లో చేరిన వారు సక్రమంగా విధులు నిర్వహించి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని కోరారు. అడిషనల్ కలెక్టర్లు ఖీమ్యానాయక్, సత్యప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు జిందం కళ, రామతీర్థపు మాధవి తదితరులు పాల్గొన్నారు.



### పర్మినెంట్ చేయండి

**సిరిసిల్లటౌన్:** తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ స్కీం వర్కర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధులుగా ఉంటున్న స్కీం వర్కర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. నాయకులు మోర అజయ్, గురజాల శ్రీధర్, ఎలిగేటి రాజశేఖర్, సూరం పద్మ, సురేష్, లావణ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రోజు 105 మద్యం దరఖాస్తులు

- ఖాతా తెరవని 13 మద్యం దుకాణాలు
- జిల్లా ఆబ్కారీ అధికారి పంచాక్షరీ

**సిరిసిల్లక్రైం:** జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 48 దుకాణాలకు బుధవారం వరకు 170 దరఖాస్తులు రాగా గురువారం ఒక్క రోజే 105 టెండర్ ఫామ్ వచ్చినట్లు జిల్లా ఆబ్కారీ అధికారి పంచాక్షరీ తెలిపారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులకు గడువు ఉండగా శుభ గడియలు చూసుకుంటూ దరఖాస్తు చేస్తున్నారు. శుక్రవారం మంచిరోజు కావడంతో దరఖాస్తు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. సిరిసిల్ల సర్కిల్‌లోని మద్యం దుకాణాల్లో అన్ని షాపులకు దరఖాస్తులు రాగా ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లో 5 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు ఎవరూ దరఖాస్తులు దాఖలు చేయలేదు. వేములవాడ సర్కిల్‌లోని 8 వైన్స్‌లకు ఇప్పటి వరకు ఒక్క టెండర్ కూడా రాలేదని ఎక్సైజ్ అధికారులు లెక్కలు తెలుపుతున్నాయి.



జిల్లా ఆబ్కారీ అధికారి పంచాక్షరీ

### పొలం నిండా ఇసుక దిబ్బలే..



**వేములవాడరూరల్:** ఇటీవల కురిసిన వర్షాలకు వేములవాడ మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన గంగవ్వ పొలం ఇసుక దిబ్బలతో నిండిపోయింది. దాదాపు 20 గుంటల పొలం పూర్తిగా కొట్టుకుపోయింది. గురువారం పొలం వద్దకు వచ్చిన గంగవ్వ ఇసుక దిబ్బలను చూసి శోకసంద్రమైంది. గంగవ్వను ఓదార్చడం ఎవరీతరం కాలేదు.

### 9 మీసేవ కేంద్రాలకు అనుమతులు



ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఖీమ్యానాయక్

**సిరిసిల్లటౌన్:** జిల్లాలో కొత్తగా తొమ్మిది మీసేవ కేంద్రాలకు అనుమతులు వచ్చాయి. ఇటీవల తొమ్మిది గ్రామాల్లో మీసేవ కేంద్రాల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొమ్మిది మంది ఎంపికవగా.. వారికి అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ గురువారం ప్రొసీడింగ్స్ అందించారు. ఏవో రాంరెడ్డి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రైతులు ఆయిల్‌పామ్‌పై దృష్టి పెట్టాలి

- డీఏవో భాస్కర్

**బోయినపల్లి(చొప్పదండి):** అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకొని పెరిగే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని డీఏవో భాస్కర్ కోరారు. మండలంలోని విలాసాగర్ పరిధిలో పంటల నమోదు ప్రక్రియను గురువారం పరిశీలించారు. ఏఈవో రజిత, రైతులు ఉన్నారు.

# మహిళలు మౌనం వీడాలి




మాట్లాడుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

- అఘాయిత్యాలపై అవగాహన అవసరం
- అతివల రక్షణకు అత్యంత ప్రాధాన్యం
- సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

**సిరిసిల్లక్రైం:** మహిళలు తమపై జరుగుతున్న వేధింపులు, అఘాయిత్యాలపై మౌనం వీడాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి కోరారు. సిరిసిల్లలోని నర్సింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన షీటీం అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. అతివల రక్షణకు షీటీం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. విద్యాభ్యాసంలో క్రమశిక్షణ, పాజిటివ్ ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. ఏర్పరుచుకున్న లక్ష్యాలను చేరుకునే వరకు నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్యార్థినులు ఆపద సమయంలో డయల్ 100, జిల్లా షీ టీమ్ 87126 56425 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో సమస్య వస్తే వెంటనే డయల్ 100 సంప్రదించాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయినట్లుగా గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్, షీటీమ్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

**విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి**

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఉన్నత చదువులు చదివి, జీవితంలో రాణించాలని సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో గురువారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. సమాజంలో కొంతమంది తమ స్వార్థం కోసం గంజాయి, గుడుంబా, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఏబీవీపీ హాస్టల్స్ కన్వీనర్‌కు సన్మానం


రంజిత్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం అలుపెరగని పోరాటం చేసి, జైలుకు వెళ్లి వచ్చిన ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్‌ను యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఉప సర్పంచు ఒగ్గు రజిత మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాల కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కళాశాల మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాల్‌రాజ్‌యాదవ్, నాయకులు నూకల శ్రీనివాస్, మహేశ్, బాల్‌రాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన గుడిసె కనకయ్య ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరిగి, సామగ్రి దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగినట్లు పేర్కొన్నారు. చుట్టుపక్కలవారు వెంటనే నీళ్లు చల్లడంతో పెనుప్రమాదం తప్పిందన్నారు.

### 18 నుంచి రాజన్న సన్నిధిలో శ్రావణమాస వేడుకలు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈ నెల 18 నుంచి శ్రావణమాస వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18, 25న శుక్రవారాల్లో మహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు, 21, 28న సోమవారాల్లో స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ మండపంలో మహాలింగార్చన, 29 మంగళవారం స్వామివారి కల్యాణ మండపంలో ఋగ్వేదినం ఉపాకర్మ, 31న గురువారం నాగిరెడ్డి మండపంలో యజుర్వేదీనం ఉపాకర్మ, సెప్టెంబర్ 1న మహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు, సెప్టెంబర్ 3న స్వామివారికి అభిషేకం, 4న మహాలింగార్చన, 6న శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా కల్యాణ మండపంలో ఉట్లు కొట్టుట, డోలోత్సవం, 8న మహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు, 9న సదస్యం, 10న సీతారామచంద్ర స్వామివారికి అభిషేకం, సదస్యం, 11న కల్యాణ మండపంలో మహాలింగార్చన, 13న స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూర్ణాహుతి, మహాలింగార్చన జరుపుతామని పేర్కొన్నారు.

### సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

సిరిసిల్లకల్చరల్: జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి అజ్మీర రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్ ఫుట్‌బాల్, హాకీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, గ్రికో రోమన్, బెస్ట్ ఫిజిక్ తదితర క్రీడల్లో ఎంపిక పోటీలు ఈ నెల 16న నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల రాష్ట్ర ప్రభుత్వ స్త్రీ, పురుష ఉద్యోగులు జిల్లా క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటినవారు రాష్ట్ర, అక్కడి నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని అన్నారు.

# ఆత్మరక్షణకు.. ఆపరేషన్ జ్వాల

- విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ
- జిల్లాలోని 113 పాఠశాలల ఎంపిక
- అనంతరం మహిళలకు కూడా..
- ఒక్కో స్కూల్లో పది రోజులు తర్ఫీదు


సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇస్తున్న ట్రైనర్స్


శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

సిరిసిల్లక్రైం: మహిళలు, విద్యార్థినులు స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవడంతో ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేలా శిక్షణ ఇచ్చేందుకు జిల్లా పోలీసు శాఖ శిక్షణ కార్యక్రమానికి నడుం బిగించింది. 'ఆపరేషన్ జ్వాల' పేరిట జరిగే ఈ కార్యక్రమం ముందుగా పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు, అనంతరం మహిళలకు శిక్షణనిచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 113 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లా పోలీస్ శాఖ కొనసాగిస్తున్న 'ఆపరేషన్ జ్వాల'పై కథనం..

**20 పాఠశాలలకు 20 మంది ట్రైనర్లు**

జిల్లాలోని 113 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మూడునెలల పాటు సెల్ఫ్ డిఫెన్స్‌పై అనుభవం కలిగిన శిక్షకులతో శిక్షణ ప్రారంభమైంది. జూన్ నుంచి కార్యక్రమం ప్రారంభం కాగా కరాటే శిక్షకుడు మన్నాన్, అఖిల, సమీరా విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఒక్కో స్కూల్లో పదిరోజుల పాటు పోలీసుశాఖ నేతృత్వంలో శిక్షణ ఉంటుంది. విద్యార్థినులకు మాస్టర్స్ శిక్షణ అందించడం అభినందనీయమని పోలీసు అధికారులు తెలుపుతున్నారు. ఎనిమిది మంది కరాటే ట్రైనర్స్ రెండున్నర నెలల్లో 20 పాఠశాలల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పినట్లు చెబుతున్నారు.

**పోకిరీల నుంచి రక్షణకు..**

మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ ఇప్పటికే షీటీం, డయల్ 100 అందుబాటులో ఉంచిన విషయం తెలిసిందే. పోకిరీల నుంచి రక్షణ పొందేందుకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. వేధింపులు, చైన్ స్నాచింగ్, దాడులనుంచి తప్పించుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు.

**సమర్థంగా నేర్చుకోవాలి**



సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు సమర్థంగా నేర్చుకోవాలి. సామాజిక బాధ్యతగా ముందుకువచ్చిన కరాటే ట్రైనర్స్‌కు అభినందనలు. విద్యార్థినులు ఏదైనా సమస్య ఉంటే డయల్ 100, షీటీం 871656425 నంబర్‌లో సంప్రదిస్తే రక్షణ కల్పిస్తాం. పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

**శిక్షణ ఇవ్వడం అభినందనీయం**



మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నా కొన్నిచోట్ల వేధింపులకు గురవుతున్నారు. తమను తాము రక్షించుకునేందుకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ఉపయోగపడతాయి. జిల్లా పోలీస్ శాఖ 'ఆపరేషన్ జ్వాల' పేరిట సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ అందించడం అభినందనీయం.

– రమేశ్ కుమార్, డీఈవో

**సామాజిక బాధ్యత**



ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల నిర్మూలనకు అవసరమైన సెల్ఫ్‌డిఫెన్స్ మెలకువలు నేర్పించడం సామాజిక బాధ్యతగా తీసుకున్నాం. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారం పని చేస్తున్నాం. తాము నేర్చుకున్న విద్యను విద్యార్థినులకు నేర్పేందుకు పోలీస్‌శాఖ అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉంది.

– మన్నాన్, సెల్ఫ్‌డిఫెన్స్ ట్రైనర్, వేములవాడ

# ఐదు సర్వేలు బీఆర్‌ఎస్‌కే అనుకూలం

- మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించి, మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చూస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లిలో వేములవాడరూరల్ మండల నాయకులతో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ రెండోసారి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని వర్గాలకు సమాన లాభం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందాయని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి రూ.350 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మన జిల్లాకు రానున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీయేనని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఏశ వాణి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, పార్టీ మండలాధ్యక్షుడు గోస్కుల రవి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజారవాణాలో మేటి.. ఆర్టీసీ**

వేములవాడ: ప్రజారవాణాలో ఉత్కృత్తమ సేవలందించింది ఆర్టీసీ సంస్థనేనని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కొనియాడారు. ఇలాంటి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో స్థానిక ఆర్టీసీ అధికారులు, సిబ్బంది గురువారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయితో పట్టుబడ్డ యువకుడి ఆత్మహత్యాయత్నం

- పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్న మరొకరు

చందుర్తి(వేములవాడ): గంజాయితో పట్టుబడ్డ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో కలకలం రేపింది. తిమ్మాపూర్‌కు చెందిన పిట్టల అజయ్ చందుర్తి శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద 60 గ్రాముల గంజాయితో బుధవారం రాత్రి చందుర్తి పోలీసులకు పట్టుబడ్డాడు. పంచనామా అనంతరం పూచీకత్తుపై అదే రోజు రాత్రి ఇంటికి పంపించారు. పోలీసులకు పట్టుబడడం అవమానంగా భావించిన సదరు యువకుడు ఇంట్లోనే రాత్రి 11 గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. కడుపులో మంట రావడంతో స్నేహితులకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. వెంటనే వేములవాడ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా ఈ విషయమై చందుర్తి ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా 60 గ్రాముల గంజాయితో యువకుడు పట్టుబడ్డాడని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నోటీస్ ఇచ్చి అదే రోజు రాత్రి పూచీకత్తుపై ఇంటికి పంపించినట్లు వివరించారు.

**తప్పించుకున్న మరో యువకుడు**

కొద్ది నెలలుగా మండలంలో గంజాయిని జోరుగా విక్రయిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు పక్కా సమాచారంతో బుధవారం రాత్రి గంజాయి విక్రయిస్తున్న యువకులను పట్టుకున్నారు. కానీ అక్కడే ఉన్న మరొకరు గంజాయితో పోలీసుల కళ్లు గప్పి తప్పించుకున్నట్లు ప్రచారంలో ఉంది. ఏది ఏమైనా గంజాయి సరఫరా చేసే వ్యక్తులను విచారిస్తే మరింత సమాచారం బయటపడేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలంలో క్షేత్రస్థాయిలో నిఘా కొరవడడంతోనే గంజాయి వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు చర్చ సాగుతోంది.

# మిద్దె రాములుకు నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడఅర్బన్: జానపద కళాకారుడు, ఒగ్గు కథకుడు మిద్దె రాములు జయంతిని వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని ఆయన నివాసంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిద్దె రాములు డాక్టర్ సి.నారాయణరెడ్డి అంతటి గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన కుటుంబసభ్యులు కూడా గొప్ప కళాకారులు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. మిద్దె రాములు జానపద కళారంగానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

**చందుర్తి ప్రాథమిక పాఠశాలలో..**

చందుర్తి: ఒగ్గు కథకుడు మిద్దె రాములు జయంతిని చందుర్తి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ విద్యార్థులకు మిద్దె రాములు జీవిత విశేషాలను తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు నరేశ్, ముఖేశ్, చంద్రకళ, శైలజ, మమత, స్వప్న, భూజ్యోతి పాల్గొన్నారు.

# గ్రామాల్లో కేంద్ర బృందాల పర్యటన


తెర్లుమద్దిలో కేంద్ర బృందానికి స్వాగతం పలుకుతున్న సర్పంచు, కార్యదర్శి

ముస్తాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కోసం కేంద్ర బృందం సభ్యులు ముస్తాబాద్ మండలంలోని తెర్లుమద్ది, సేవాలాల్‌తండా, బందనకల్ గ్రామాల్లో గురువారం పర్యటించారు. పచ్చదనం, పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ, శ్మశానవాటికల వినియోగం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సామాజిక పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. టీం లీడర్ శ్రీనివాస్, సభ్యులు అయాజ్, సాయి, ఎంపీడీవో రమాదేవి, సర్పంచులు కిషన్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వరి, ఏపీవో ఆనంద్‌మోహన్, ఏపీఎం దేవరాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ, దేశాయిపల్లె గ్రామాల్లో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు పర్యటించారు. పచ్చదనం, పరిశుభ్రతపై గ్రామస్తులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో లచ్చాలు, ఇన్‌చార్జి ఎంపీవో విజయేందర్ రెడ్డి, జేఈ రాజనర్సు, సర్పంచులు నకీర్తి బాలమల్లు, జక్కుల రవీందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**రుద్రంగి మండల కేంద్రంలో..**

రుద్రంగి(వేములవాడ): స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్రం బృందం గురువారం రుద్రంగి మండల కేంద్రంలో పర్యటించింది. మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులను పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు.

# కల్వర్టు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి


కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న సత్యం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే రోడ్డులో శిథిలమైన కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి, వర్షాల కారణంగా కోతకు గురైన కల్వర్టును పరిశీలించారు. ఏటా వర్షాలకు కల్వర్టు మీదుగా వరద నీరు వెళ్తుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇసుక మేటలు వేసిన పంట చేలకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు పులి లక్ష్మీపతి, బోయిని ఎల్లేశ్, ఉయ్యాల శ్రీనివాస్, ఏనుగుల కనకయ్య, గుడి శేఖర్‌రెడ్డి, నాగుల వంశీ, నిమ్మ వినోద్‌రెడ్డి, ఆకుల అజయ్ తదితరులున్నారు.

# చేపలు పట్టడానికి వెళ్లి కరెంట్‌షాక్‌తో మృతి

- మల్లారెడ్డిపేటలో విషాదం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


రాయిమల్లు (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): చేపలు పట్టడానికి వెళ్లి కరెంట్‌షాక్‌కు గురై ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు.. మల్లారెడ్డిపేటకు చెందిన కొంపల్లి రాయమల్లు(58) గురువారం గ్రామ సమీపంలోని మానేరువాగులో చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పేదలను తప్పుదారి పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- 'డబుల్' ఇళ్లు ఇస్తామని ఆశపెట్టి, చేతులెత్తేశారు..
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్


మాట్లాడుతున్న మహేశ్

చందుర్తి(వేములవాడ): పేదలను మరోసారి తప్పుదారి పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్ విమర్శించారు. చందుర్తిలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందిస్తామని ఆశ పెట్టి..చివరికి చేతులెత్తేశారన్నారు. స్థలం ఉన్న వారికి వెంటనే గృహలక్ష్మి పథకం అమలు చేసి, మిగతా వారికి ప్రభుత్వం భూమిని కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితబంధు, బీసీబంధులను అధికార పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నారే తప్ప అర్హులకు అందడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్, నాయకులు చిర్రం తిరుపతి, పెరుక గంగరాజు, ఎరువా మహేశ్, మోతుకుపల్లి మధు పాల్గొన్నారు.

# రన్నింగ్ బస్సులో నుంచి దూకి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నడుస్తున్న బస్సులో నుంచి దూకి ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం తంగళ్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సిరిసిల్లకు వస్తుండగా తంగళ్లపల్లికి చేరుకోగానే ఓ ప్రయాణికుడు హఠాత్తుగా రన్నింగ్ బస్సులో నుంచి దూకాడు. తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికి తెలియకపోవడంతో ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

### విద్యుదాఘాతంతో రైతు..


రాజు మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కోళ్లమద్దిలో విద్యుత్‌షాక్ తగిలి గురువారం ఛాత్రబోయిన రాజు(47) అనే రైతు దుర్మరణం చెందాడు. పొలానికి నీరు పెట్టడానికి వెళ్లగా మోటారు నడువలేదు. మోటారు నుంచి ఉన్న సర్వీస్ వైరును పరిశీలిస్తుండగా తేలిన తీగలు తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన గ్రామంలో విషాదం నింపింది. మృతునికి భార్య లక్ష్మి, కూతురు నవ్య, కుమారుడు స్వామి ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

### విద్యార్థి ఆత్మహత్య


భరత్ రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి భరత్‌రెడ్డి(17) అనే ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. సింగిరెడ్డి తిరుపతి రెడ్డి తన కుమారుడు భరత్‌రెడ్డిని ఈ ఏడాది హైదరాబాద్ నారాయణ కళాశాలలోని రెసిడెన్షియల్ హాస్టల్‌లో చేర్పించాడు. ఆర్థిక భారం పెరగడంతో అక్కడికి సమీపంలో ఉన్న తన సోదరి ఇంట్లో వసతి ఏర్పాటు చేసి, రోజూ కళాశాలకు పంపిస్తున్నాడు. ఈ క్రమంలో తండ్రి ఆర్థిక ఇబ్బందులు చూడలేక భరత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. కాసేపటికే ఉరేసుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం, చదువుపై శ్రద్ధ లేక ఒత్తిడిలో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### గంజాయి విక్రేత అరెస్టు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ ప్రాంతంలో గురువారం సాయంత్రం గంజాయి విక్రయిస్తున్న ఎస్‌కే ముఖీద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెండా మహేశ ప్రాంతానికి చెందిన ఎస్‌కె ముఖీద్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు గురువారం నిఘా పెట్టి అరెస్ట్ చేశారు.

### గల్ఫ్ ఏజెంట్‌పై కేసు

సారంగాపూర్(జగిత్యాల): జగిత్యాల పట్టణానికి చెందిన గల్ఫ్ ఏజెంటుపై గురువారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని గణేశ్‌పల్లికి చెందిన బెత్తపు అశోక్ యూరప్ వెళ్లడానికి గల్ఫ్ ఏజెంట్ మహేశ్‌కు రూ.3.30 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. ఇందులో ఏజెంటుకు రూ.2.30 లక్షలు ముట్టజెప్పాడు. ఎనిమిది నెలలు గడుస్తున్నా అశోక్‌ను యూరప్ పంపించే విషయంపై ఎలాంటి పురోగతి కనిపించలేదు. దీంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అశోక్ కోరాడు. ఈక్రమంలో మహేశ్ డబ్బు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతుండడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# బీఎస్‌ఎన్‌ఎల్ సేవల ఆధునికీకరణ

- ఆటంకం లేకుండా నిరంతరం సేవలు
- డీజీఎం దినేశ్


మాట్లాడుతున్న డీజీఎం దినేశ్

సిరిసిల్లటౌన్: ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్ బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసులో కొన్ని రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంతో ఏర్పడిన అంతరాయాన్ని పరిష్కరించినట్లు డీజీఎం దినేశ్ తెలిపారు. సిరిసిల్ల బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసులో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అగ్నిప్రమాదంతో వినియోగదారులకు చాలా రోజులు సేవల్లో అంతరాయం ఏర్పడిందన్నారు. ఇందుకుగాను నెలసరి బిల్లుల్లో రాయితీ కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాంకేతికతను పూర్తిగా ఆధునీకరించామని.. నిరంతరం ఆటంకం లేకుండా సేవలు అందుతాయని తెలిపారు. ఆర్‌ఎం మోహన్, ఏజీఎం రమేశ్, డీఈ జనార్దన్, రవి, తిరుమల, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తెలతాడు దొంగల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

మల్యాల(చొప్పదండి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడ నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన నిందితులను పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ ఎన్.వెంకటస్వామి వివరాలు వెల్లడించారు. లంబాడీపల్లి గ్రామానికి చెందిన పొన్నం రాజవ్వ బుధవారం మల్యాల అడ్డరోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి మహిళ మెడలోని పుస్తెల తాడు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్యాల సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్సైలు అశోక్, కుమారస్వామి, వెంకటరావు ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టి, మహిళ పుస్తెలు చోరీ చేసిన దొంగలు మల్యాల మండలం సర్వాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి అనిల్, బాసోజి అనిల్‌గా గుర్తించారు. చోరీ చేసిన బంగారం గురువారం కరీంనగర్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు కొండగట్టు స్టేజీ వద్ద ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 15 గ్రాముల బంగారం, స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వెల్లడించారు. 24గంటల్లోనే కేసు ఛేదించడంపై సీఐ కోటేశ్వర్, ఎస్సైలను ఎస్పీ భాస్కర్, డీఎస్పీ అభినందించారు.